అడుగంటుతున్న జలం

- కుభీర్ మండలంలో ఎండుతున్న యాసంగి పంటలు
- పనిచేయని బోరుబావులు
- లబోదిబోమంటున్న రైతులు



ఈచిత్రంలో కన్పిస్తున్నది కుభీర్ మండలం దార్‌కుభీర్‌కు చెందిన రొక్కెర నాగేశ్ అనే రైతు. ఇతడు తనకున్న రెండెకరాల్లో, పక్కనే ఉన్న బెల్గాం గ్రామశివారులో 10ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. రెండు బోరుబావుల్లో ఒకటి 15 రోజుల కిందటే ఎండిపోగా.. మరో బోరు నుంచి నీళ్లు కొద్దిగానే వస్తున్నాయని వాపోతున్నాడు. ఈ పంట చేతికి రాకుంటే సుమారు రూ.లక్షల్లో నష్టపోతానని ఆవేదన చెందుతున్నాడు.



బెల్గాంలో నీళ్లు లేక ఎండిపోతున్న మొక్కజొన్న చేను



బెల్గాం శివారులో ఎండిన బోరుబావి



కుభీర్‌లో మోటారు ద్వారా మురికి నీటిని పంటలకు అందిస్తున్న దృశ్యం

కుభీర్: మండలంలోని పలు గ్రామాల్లో సాగునీరు అందక పంటలు ఎండుతున్నాయి. ఇప్పటికే ఎండలు పెరగడంతో దార్‌కుభీర్, కస్రా, బెల్గాం, పార్డి(కె), రాజురా గ్రామాల్లో భూగర్భజలాలు పాతాళానికి పడిపోవడంతో బోరుబావుల నుంచి సరిపడా నీరు రావడం లేదు. దీంతో అప్పులు తీసుకొచ్చి పంటలు సాగు చేస్తే తమ కళ్లముందే ఎండిపోతున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికే కొందరి రైతుల బోరుబావులు తక్కువ నీళ్లు పోస్తుండగా.. మరికొన్ని బోరుబావులు పనిచేయడం లేదు. మండలంలో 50వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో 15వేల ఎకరాల్లో మొక్కజొన్న, 3వేల ఎకరాల్లో జొన్న, వెయ్యి ఎకరాల్లో గోధుమ, 200 ఎకరాలలో నువ్వు పంటలను యాసంగిలో రైతులు సాగు చేస్తున్నారు.

చెరువులకు మరమ్మతులేవి..?

ఈసారి మండలంలో తక్కువ వర్షాలు కురువడం, పైగా దొడర్నా చెరువు కట్ట రెండేళ్ల కిందట తెగిపోయినప్పటికీ మరమ్మతులు చేపట్టలేదు. దీంతో అందులో చుక్క నీరు నిలువడం లేదు. దార్‌కుభీర్ చెరువు అలుగు దెబ్బతినడంతో అందులోనూ నీరు కరువైంది. దీంతో దార్‌కుభీర్, కుభీర్ శివార్లలో బోర్లు అడుగంటాయి. ఈచెరువుల్లో నీరుంటే సమీప ప్రాంతాల్లో భూగర్భజలాలు పైనే ఉండేవి.

బోరు ఎండిపోయింది



నేను మూడెకరాల్లో మొక్కజొన్న, ఎకరంలో జొన్న పంట సాగు చేస్తున్నా. మా చేను వద్ద బోరుబావి ఎండిపోవడంతో పక్క చేను రైతు బోరుతో ఒక తడి నీటిని అందించాను. పంట చేతికి రావాలంటే.. మరో రెండు తడులు అవసరం. జొన్న పంట పోయినట్లే. ఇప్పటికే పెట్టుబడులకు రూ.15వేల ఖర్చు దాటింది.

– పిట్ల రాందాస్, రైతు, కుభీర్

రెండెకరాల్లో మొక్కజొన్న వేశా



నేను రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నా. పంట చేతికి రావాలంటే మూడు తడులు అవసరం. మా బోరు ఎండిపోయింది. చుట్టుపక్క బోర్లు ఎండిపోయాయి. ఇప్పుడు మరొకరి బోరుతో నీటిని అందిస్తున్నా. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, మందుల కోసం రూ.30వేలు ఖర్చు చేశా.

– మంగళి సాయి, రైతు, కుభీర్

ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్న రైతులు..

ఎండలు పెరగడంతో దాదాపు నూటికి 80 శాతం బోరుబావులు కొద్దికొద్దిగానే నీళ్లు పోస్తున్నాయి. మరో 20 శాతం బోరుబావులు ఇప్పటికే ఎండిపోగా రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. కొందరు పక్క చేన్ల రైతుల బోర్ల నుంచి నీటిని అందిస్తూ పంటలను కాపాడుకుంటే.. మరికొందరు యంత్రాలను తీసుకొచ్చి బోర్లు వేస్తున్నారు.

- దార్‌కుభీర్ గ్రామంలో బంక పోతన్న, తోకల హన్మంతు, తోకల రమేశ్ తమ పంటలను కాపాడుకునేందుకు యంత్రాలను తీసుకొచ్చి బోర్లు వేసుకున్నారు. కుభీర్‌కు చెందిన ఓ రైతు బోరుబావి ఎండిపోవడంతో తనకున్న ఎకరం మొక్కజొన్న చేనుకు గ్రామంలోని మురికి కాలువ నీటిని అందిస్తున్నాడు.
- బెల్గాంలో నిస్తుర్ గంగాధర్, కుభీర్‌లో పుప్పాల గంగాధర్, సర్కిల్ శ్రీనివాస్, దొంతుల గంగాధర్, శంకర్‌సింగ్, మంగళి నర్సింలుకు చెందిన బోర్లు పూర్తిగా ఎండిపోయాయి.

క్లుప్తంగా

వర్గీకరణ బిల్లు రద్దు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మామడ: అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఎస్సీ వర్గీకరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో గురువారం వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఎస్సీలకు 20శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మధుకర్, రాజేందర్, సురేశ్, సుధాకర్, సుదర్శన్, భూమన్న ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు కృషి

భైంసాటౌన్: బాసర మండలంలోని బిద్రెల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.నారాయణ్‌రావు పటేల్‌ను కోరారు. గురువారం పట్టణంలోని ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. స్పందించిన ఆయన అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. దీంతో వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిద్రెల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బాబా ఆలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. వివిధ గ్రామాల నుంచి మహిళలు సాయినామస్మరణ చేస్తూ ఆలయానికి పాదయాత్రగా వచ్చారు. హారతి కార్యక్రమంలో పూజలు చేసి బాబాను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి




పన్నుల వసూలులో పాల్గొన్న కమిషనర్

భైంసాటౌన్: పట్టణవాసులు ఆస్తిపన్ను సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ బి.రాజేశ్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని నాలుగో వార్డులో పన్నుల వసూలు కోసం సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆస్తి, నీటి పన్నులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ మేనేజర్ గౌరీశ్, ఇన్‌చార్జి ఆర్వో రమేశ్, బిల్ కలెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

మొరం టిప్పర్లకు జరిమానా

ఖానాపూర్: అనుమతి లేకుండా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టణంలోని ప్రధాన రహదారిపై పట్టుకున్నామని తహసీల్దార్ సుజాత తెలిపారు. ఒక్కో టిప్పర్‌కు రూ.2500 చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతులు తీసుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ పరిశీలన



స్క్వాడ్ ఓం ప్రకాశ్‌తో అధ్యాపకులు

కడెం: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలను గురువారం స్క్వాడ్ ఓం ప్రకాశ్ తనిఖీ చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఇందులో సీఎస్ సరిత, అధ్యాపకుడు స్వామి తదితరులున్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన ఎంపీడీవో



జోహర్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్, అబ్దుల్లాపూర్, జోహర్‌పూర్, పంచగుడి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఎంపీడీవో వెంకటరమేశ్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించి దివ్యాంగులకు ర్యాంప్‌లు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈవోపీఆర్డీ సోలమాన్ రాజ్, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

గోసంపల్లెలో పశువైద్యశిబిరం

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామంలో గురువారం గోపాలమిత్ర ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని వెటర్నరీ ఏడీ రామారావు రాథోడ్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. పశువుల గర్భకోశ వ్యాధి చికిత్స కోసం నిర్వహించే పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువులకు చూడి, ఎద పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. సిబ్బంది గోపాల్, విజయ్, నర్సయ్య, వినాకర్ ఉన్నారు.



రైతులకు మందులు పంపిణీ చేస్తున్న అధికారులు

తల్లిదండ్రులను దైవంగా భావించాలి



ప్రవచనాలకు హాజరైన భక్తులు

తానూరు: ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో నడుస్తూ తల్లిదండ్రులను దైవంగా భావించాలని నాందేడ్ జిల్లాకు చెందిన బాల్‌యోగి శ్యాంసుందర్ మహరాజ్ పేర్కొన్నారు. మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం గురువారం ముగిసింది. ఉదయం నిర్వహించిన కాళ్యకీర్తనలో మహరాజ్ పాల్గొని భక్తులకు పలు ప్రవచనాలు బోధించారు. చెడుకు దూరం ఉండాలన్నారు. ఈసందర్భంగా పలువురు యువకులు తులసీమాలలు ధరించారు. అనంతరం ఉట్టి కొట్టి ప్రసాదం పంపిణీ చేశారు. మండలంతోపాటు మహారాష్ట్రలోని పలు గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

'మత్తు'కు బానిస కావద్దు

సారంగపూర్: మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సోషల్ జస్టిస్ ఫర్ హ్యూమన్‌రైట్స్ కమిషన్ తెలంగాణ ఉత్తర రాష్ట్ర చైర్మన్ సాప పండరి సూచించారు. మండలంలోని చించోలి(బి) ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలను వివరించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు లోను కాకుండా దేశానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని సూచించారు. కౌన్సిల్ నేషనల్ జనరల్ సెక్రటరీ మామిడాల మనోహర్, ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాప పండరి

ప్రాణప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో ధర్మారపు పోచమ్మ ప్రాణప్రతిష్ఠ ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. పండితులు చక్రపాణి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశస్త్యంతో పాటు విగ్రహాల ఊరేగింపు, నదీజలాలతో జలాధివాసం, స్థాపిత దేవతామండప పూజలు చేశారు. శుక్రవారం ప్రాణప్రతిష్ఠాపన, శనివారం బోనాల ఊరేగింపు, అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



గంగాజలంతో వస్తున్న మహిళలు

బీజేపీ మండలాధ్యక్షుడికి సన్మానం

సారంగపూర్: బీజేపీ మండలాధ్యక్షుడిగా నియమితులైన కాల్వ నరేశ్‌ను ఆయన స్వగ్రామం మలక్ చించోలిలో పదోతరగతి పూర్వవిద్యార్థులు సత్కరించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు.

ఉరేసుకొని ఆత్మహత్య

కడెం: మండలంలోని నవాబ్‌పేట్ గ్రామంలో కటికనపెల్లి నాగన్న (49) అనే వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి కథనం ప్రకారం.. నాగన్న కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గురువారం తమ ఇంటి సమీపంలోని పశువుల కొట్టంలో దూలానికి ఉరేసుకుని మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'చలో హైదరాబాద్' విజయవంతం చేయండి

లోకేశ్వరం: ఈనెల 10న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకుడు పోశెట్టి కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు, కార్మిక వ్యతిరేక బడ్జెట్‌ను ఖండిస్తూ చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి అన్నివర్గాల ప్రజలు రావాలని కోరారు.

'అశోక్‌కుమార్‌ను గెలిపించాలి'

నిర్మల్‌టౌన్: ప్రభుత్వ విద్యాసంస్థలను కాపాడే వారికి ఓటు వేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా యూటీఎఫ్ బలపరిచిన టీపీటీఎఫ్ అభ్యర్థి అశోక్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్, సభ్యులు మూడారపు పరమేశ్వర్, అశోక్, గోవర్ధన్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కడెం: మండలంలోని పెద్దూర్‌తండాకు చెందిన ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ టెక్నికల్ అసిస్టెంట్ భిక్యానాయక్ ఇటీవల మృతి చెందాడు. గురువారం బాధిత కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ పరామర్శించారు. ఇందులో హపవత్ రాజేందర్, దేవేందర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఖానాపూర్: దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీకి కట్టుబడి బీసీ కులగణనను పూర్తి చేసిందని కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు దయానంద్, నిమ్మల రమేశ్ అన్నారు. గురువారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్నం సత్యం, అంకం రాజేందర్, కడార్ల గంగనర్సయ్య, తోట సత్యం, షౌకత్‌పాషా, స్వప్నిల్ రెడ్డి, శంకర్, సురేశ్, అశోక్, రాజేశ్వర్, శ్రీనివాస్ ఉన్నారు.

పసుపు మార్కెటింగ్‌పై అవగాహన

లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామంలో పసుపు పంట సాగు చేసే రైతులకు గురువారం మార్కెటింగ్ అవకాశాలపై వ్యవసాయాధికారి వసంత్‌రావు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రసాయనాలు లేని పంటలు కొనేందుకు ముందుకొచ్చిన ఐటీసీ కంపెనీతో రైతులకు ఒప్పందం కుదిర్చారు. పసుపును ఐటీసీ కంపెనీకి అమ్మే విధానం వివరించారు. పసుపులో క్లోరోఫైరీఫాస్ విలువలు ఉన్నాయా.. లేదా? అని పరీక్షించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈసందర్భంగా కొందరి రైతుల చేన్లలోని పసుపు నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో ఏఈఓ సుస్మిత, ఐటీసీ కంపెనీ అధికారులు వెంకట్‌గాంధీ, నారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏవో వసంత్‌రావు

మచ్చలుంటే వైద్యుల్ని సంప్రదించాలి

నిర్మల్‌టౌన్: శరీరంపై స్పర్శ లేని మచ్చలుంటే వైద్యుల్ని సంప్రదించాలని ఆశవర్కర్లు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. జాతీయ లెప్రసీ నివారణ కార్యక్రమాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు లెప్రసీ(కుష్ఠు) వ్యాధిపై ఆశవర్కర్లు అవగాహన కల్పించారు. లెప్రసీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హేమలత, ఆశవర్కర్లు లావణ్య, సౌమ్య, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఆశవర్కర్లు, ఉపాధ్యాయులు

గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలి

ఖానాపూర్: మారుమూల గ్రామాల్లో సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తొడసం శంభు అన్నారు. గురువారం మండలంలోని ఎర్వచింతల్ పంచాయతీ పరిధిలోని కుసుంపూర్ గ్రామంలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో రోడ్లు సరిగా లేకపోవడంతో రైతులు ఎడ్లబండ్లు, వాహనాలపై పంటలను మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వరదలకు రోడ్లు కోతకు గురవకుండా పైపులైన్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఎర్వచింతల్ నుంచి కుసుంపూర్ వరకు రోడ్డు నిర్మించాలన్నారు. తిరుపతి, అర్జున్, దుర్గ, మోతీరాం, శ్రీరాం, దేవుబాయి, జంగుబాయి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న శంభు

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఖానాపూర్: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని రాజురా, బావాపూర్(ఆర్), సింగాపూర్, దాసునాయక్ తండా, చందునాయక్ తండా తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వీధులు తిరుగుతూ సమస్యలను తెలుసుకున్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు.



రాజూరాలో మరమ్మతు చేయిస్తున్న ఎంపీవో

ప్రయోగాల విద్యతో వెలుగులోకి ప్రతిభ

ఖానాపూర్: ప్రయోగాలతో కూడిన విద్యతోనే విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని ఎంపీడీవో సునీత అన్నారు. మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం నిర్వహించిన సాంఘిక శాస్త్ర మేళాను సందర్శించారు. ఈసందర్భంగా ఆరో తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థుల ప్రయోగాలను పరిశీలించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నరేందర్‌రావు, కార్యదర్శి కల్పన , ఉపాధ్యాయులు శేఖర్, కిషన్, ప్రసాద్, చందన తదితరులున్నారు.



బహుమతులు అందిస్తున్న ఎంపీడీవో సునీత

పోచమ్మకు చలిబోనాలు

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్, అంబేడ్కర్ నగర్ కాలనీలో ఉన్న ముత్యాల పోచమ్మకు గురువారం మహిళలు చలి బోనాలను సమర్పించారు. ప్రతీ ఆది, గురు వారాల్లో పుష్య అమావాస్య సందర్భంగా ఈ బోనాల సమర్పణ కార్యక్రమం ఉంటుందని అర్చకులు శరత్‌చంద్ర శర్మ తెలిపారు. పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మహిళలు గ్రామదేవతలకు బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



శాంతినగర్‌లో బోనాలతో వెళ్తున్న మహిళలు

బ్యాంక్ ఉద్యోగి అప్రమత్తతతో తప్పిన ముప్పు

- రూ.2.20లక్షలు సైబర్ మోసగాళ్లకు చెల్లించకుండా ఓ వ్యక్తిని అడ్డుకున్న వైనం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలో ఓ బాధితుడిని డబ్బులు పోగొట్టుకోకుండా బ్యాంకు ఉద్యోగి కాపాడాడు. వివరాల్లోకి వెళితే.. పట్టణానికి చెందిన గోవిందరావుకు ఢిల్లీ పోలీసులమంటూ గురువారం కొందరు ఫోన్ చేశారు. బ్యాంకు లావాదేవీలు పరిమితికి మించిపోయాయని.. మిమ్మల్ని పోలీసులు అరెస్టు చేస్తారని భయభ్రాంతులకు గురిచేశారు. మేము చెప్పిన ఖాతాలో రూ.2.20 లక్షలు వేస్తే సమస్య పరిష్కారం అవుతుందని సూచించారు. దీంతో అతడు ఆ డబ్బులను ఖాతాలో వేసేందుకు బ్యాంకుకు వెళ్లాడు. భయంభయంగా ఉన్న అతడిని ఓ బ్యాంకు ఉద్యోగి గమనించి వివరాలు తెలుసుకున్నాడు. గోవిందరావు జరిగినదంతా బ్యాంకు ఉద్యోగికి చెప్పాడు. అదంతా మోసమని చెప్పి డబ్బులు జమచేయకుండా అడ్డుకున్నాడు.

పరామర్శ

లక్ష్మణచాంద: హైదరాబాద్‌లో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని మండల నాయకులు పరామర్శించారు. ఐకేరెడ్డి సోదరి ఇటీవల మృతి చెందగా గురువారం డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, ఒస రాజేశ్వర్, కేశం రమేశ్, అశోక్, వెంకటరాజు, గంగారాం, అర్జున్‌రెడ్డి, పోశెట్టి, గంగాధర్, సుదర్శన్ తదితరులు ఉన్నారు

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సాయారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నారు. గురువారం సాయారెడ్డి ఆరోగ్య పరిస్థితిని జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ అడిగి తెలుసుకున్నారు. ప్రశాంత్, దిగంబర్, అనిల్, భోజన్న, మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, పోతారెడ్డి ఉన్నారు.